క్లుప్తంగా

జగనన్న మళ్లీ సీఎం కావాలి



తిరుమల కొండపైకి వెళ్తున్న కార్యకర్తలు

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించి జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుతూ కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి గ్రామానికి చెందిన కార్యకర్తలు పాండు, తిప్పేస్వామి, నాగరాజులు శనివారం తిరుమలకు వెళ్లారు. శ్రీవారి మెట్ల మార్గం నుంచి కొండపైకి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మేజర్ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది

ఉరవకొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని మలేరియా, డెంగీ లాంటి విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ భక్తుల కోదండరామిరెడ్డి సూచించారు. శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. దోమ కాటుతో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దోమతెరలు వినియోగించాలని, టైర్లు, పూలకుండీలు, తొట్టెల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

జోరుగా ఇంటింటి సర్వే



కోనాపురంలో సర్వే చేస్తున్న ఐఈఆర్‌పీలు

ఉరవకొండ: నియోజకవర్గంలో సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలున్న పిల్లల గుర్తింపు కోసం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను శనివారం ఉరవకొండ ఎంఈఓ-1 ఈశ్వరప్ప, ఎంఈఓ-2 రమాదేవి పర్యవేక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 28 గ్రామాల్లో తొలివిడతగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి ఎమ్మార్సీ కార్యాలయాల్లో భవిత కేంద్రాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు.

4,900 క్వింటాళ్ల వేరుశనగకు ప్రతిపాదనలు

కుందుర్పి: కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు రెండో విడత కింద మరో 4,900 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఏడీఏ యల్లప్ప తెలిపారు. మొదటి విడత కింద 9,800 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. రెండో విడత కింద కుందుర్పి మండలానికి 1000 క్వింటాళ్లు, శెట్టూరు 850, కంబదూరుకు 950, బ్రహ్మసముద్రం 750, కళ్యాణదుర్గం మండలానికి 1,350 క్వింటాళ్ల విత్తనం అవసరం ఉందని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

మెనూ అమలు చేయాలి



కంబదూరులో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కంబదూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూను తప్పకుండా అమలు చేయాలని ఎంఈఓ విజయకుమారి, మదన్ మోహన్ సూచించారు. స్థానిక ఎంఆర్‌సీ సెంటర్‌లో మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులకు శనివారం శిక్షణ ఇచ్చారు. వంటలు రుచిగా ఉండాలని, ఏ మాత్రం తేడా వచ్చినా చర్యలు తప్పవన్నారు.

కూడేరు: కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వంటలను రుచిగా తయారు చేయాలని, మెనూను పాటించాలని, వంట గదిని, వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శిక్షకురాలు జయమ్మ, ఎంఈఓ-2 సాయికృష్ణ పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కేసులు



తాళ్లకెరలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

గుమ్మఘట్ట: గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టించాలని ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. తాళ్లకెర, బీటీపీ గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ఎన్నికల ఫలితాల రోజున విజయోత్సవాలకు అవకాశం లేదన్నారు.



ప్రత్యేక అలంకరణలో మురడి అంజన్న



గుమ్మఘట్ట మండలం గొల్లపల్లిలో ఆంజనేయస్వామి



కుందుర్పి: ప్రత్యేక అలంకరణలో అన్నలపురి ఆంజనేయస్వామి



రాయదుర్గం: అలంకరణలో అభయాంజనేయస్వామి



బ్రహ్మసముద్రంలో విశేష అలంకరణ



ఉరవకొండ: అలంకరణలో పార్కు ఆంజనేయస్వామి

రామభక్తా... నమో వాయుపుత్ర



కణేకల్లులో ప్రత్యేక అలంకరణ



బెళుగుప్పలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం



కూడేరు: రామాలయంలో పూజలు

రాయదుర్గం/రాయదుర్గంటౌన్/కూడేరు/బ్రహ్మసముద్రం/ఉరవకొండ/ కంబదూరు/కణేకల్లు: రామభక్తుడు హనుమాన్ జయంతి వేడుకలు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో శనివారం నేత్రపర్వంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూరం అలంకరణలు, ఆకు పూజలు నిర్వహించారు. జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన మురడి, నేమకల్లు అంజన్న ఆలయాల్లో అభిషేకం, హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ చాలిసా పారాయణం, భజన కార్యక్రమాల్లో పాల్గొని పునీతులయ్యారు. భక్తులకు అన్నదానం, ప్రసాదాలు పంచిపెట్టారు. మురడిలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగనీకుండా ఈఓ నరసింహారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మురడి ఆంజన్న దేవాలయంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, నాయకుడు పొరాళ్ల శివా పూజలు జరిపించారు. అదేవిధంగా మొళకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఉన్న అభయాంజనేయస్వామి, కోటలోని నగరేశ్వరస్వామి ఆలయంలోని పంచముఖ ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిగాయి. గుమ్మఘట్ట మండలం గొల్లపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సర్పంచ్ అనంతమ్మ, ఎంపీటీసీ నాగలక్ష్మి, నాయకుడు గౌని రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజేంద్ర, మాజీ ఎంపీటీసీ ఎస్. తిప్పేరుద్ర, గౌని కాంతారెడ్డి పాల్గొన్నారు. కూడేరులోని కోదండరామాలయంలో అర్చకుడు భాస్కర్ శర్మ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసాపురం ఆంజనేయ స్వామి, రామదుర్గం, కడదరకుంట, అంతరగంగ, పి. నారాయణపురం, కూడేరు, కలగళ్లతో పాటు మరికొన్ని గ్రామాల్లోని అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుందుర్పి మండలం సరిహద్దులో అన్నలపురి ఆంజనేయ స్వామి, వడ్డెపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంతోపాటు గుండిగానిపల్లి, వేపులపర్తి, చెలిమేపల్లి, పాలవెంకటాపురం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉరవకొండ మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. అభిషేకం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. కంబదూరు మండలం కోటగుడ్డంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. కర్ణాటక నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. కణేకల్లుతోపాటు నాగేపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి కుంకుమార్చన, అష్టోత్తరణ, ఆకుపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. బెళుగుప్ప మండలంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బూదిగుమ్మ ఆంజనేయస్వామి, రమణేపల్లి ఆంజనేయస్వామి, బెళుగుప్ప ఆంజనేయస్వామి, తగ్గుపర్తి సీతారామాంజనేయస్వామి, ఎర్రగుడి, దుద్దేకుంట, కోనంపల్లి, శీర్పి, గుండ్లపల్లి, నక్కలపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, పల్లకీ ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేవారు.

వజ్రకరూరు: వజ్రకరూరులోని కోట శ్రీచెన్నకేశవ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలతో పాటు బిందెసేవ, అభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, కలశస్థాపన, హోమం, బలి పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఈఓ అంగదాలక్రిష్టయ్య, అర్చకులు క్రిష్ణమూర్తి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వజ్రకరూరులో కోటచెన్నకేశవ ఆంజనేయస్వామికి పూజలు

నేమకల్లులో నేత్రపర్వంగా..



అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ప్రధాన అర్చకులు అనీల్‌కుమార్‌స్వామి, సంతోష్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పలతో శోభాయమానంగా అలకరించారు. మహాపూర్ణాహుతి, పంచామృతాభిషేకం, మహామంగళహారతి వంటి పూజలు జరిగాయి.భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం ఆంజనేయస్వామి నామ స్మరణతో మార్మోగింది. ఆలయ ప్రాంగణంలో స్వామివారి పల్లకీ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ నరసింహారెడ్డి, సర్పంచ్ పరమేశ్వర పాల్గొన్నారు.



ఆలయంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్, ఆర్‌ఓ జేసీ కేతన్‌గార్గ్



మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఆర్‌ఓ డాక్టర్ రాణి సుస్మిత



మాట్లాడుతున్న అధికారిణి కరుణకుమారి

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు హాజరయ్యే ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను పాటించాలని కళ్యాణ దుర్గం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి డాక్టర్ రాణి సుస్మిత తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలిసి అభ్యర్థుల తరపున కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్లకు శిక్షణ నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అభ్యర్థి తరపున ఒక్కో టేబుల్‌కు ఒక్కో ఏజెంట్‌ను నియమించుకోవచ్చన్నారు. కౌంటింగ్ హాల్ ఆవరణలోకి సెల్‌ఫోన్ అనుమతి ఉండదన్నారు. పెన్సిళ్లు తీసుకురావచ్చన్నారు. భోజన వసతితోపాటు వాష్ రూమ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. కౌంటింగ్ హాల్‌లో జరిగే ఫలితాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పొక్కనీయకూడదన్నారు. పట్టణ సీఐ హరినాథ్, పలువురు అభ్యర్థుల తరపు ఏజెంట్లు పాల్గొన్నారు.

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ ఏజెంట్లకు ఉరవకొండలోని దేవాంగ కళ్యాణ మండపంలో శనివారం జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఆర్‌ఓ కేతన్‌గార్గ్ అవగాహన కల్పించారు. మధ్యాహ్నం 3గంటలకు ఉరవకొండ నియోజకవర్గం ఫలితాలను ప్రకటించే అవకాశం ఉందన్నారు. 15 రౌండ్లలో ఫలితం తేలనుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు కోసం 6 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా ఏజెంట్లు నివృత్తి చేసుకోవచ్చన్నారు.

రాయదుర్గం రూరల్: అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు నియమించుకున్న కౌంటింగ్ ఏజెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కరుణకుమారి సమావేశం నిర్వహించారు. ఏజెంట్లు 4వ తేదీ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ ప్రదేశానికి చేరుకోవాలని సూచించారు. అధికారులు బ్రీతింగ్ అనలైజర్‌తో చెక్ చేస్తారని, తేడా వస్తే కౌంటింగ్ కేంద్రంలోకి వదిలే ప్రసక్తే ఉండదన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి 7 గంటల్లోగా వెళ్లి కెటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలన్నారు. 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లిన ఏజెంట్లు కౌంటింగ్ ముగిసే వరకు బయటకు రావడానికి వీలుండదన్నారు. ఏఈఆర్‌ఓ చిట్టిబాబు, అర్బన్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పక్కాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ



మాట్లాడుతున్న పీడీ శ్రీదేవి

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమయపాటించాలని, ఇష్టారాజ్యంగా నిర్వహిస్తే చర్యలు తప్పవని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ) బీఎన్. శ్రీదేవి హెచ్చరించారు. శనివారం కూడేరులోని ఎమ్మార్సీలో ఐసీడీఎస్ సెక్టార్ మీటింగ్-1, ముద్దలాపురంలో సెక్టార్-2 మీటింగ్ నిర్వహించారు. ముద్దలాపురంలోని సెక్టార్ మీటింగ్‌ను పీడీ తనిఖీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంచాలని, ప్రతి నెల 10వ తేదీలోపు చిన్నారుల ఎత్తు, బరువు నమోదు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కేంద్రాల నిర్వాహణకు సంబంధించిన పోస్టర్లను ఆమె విడుదల చేశారు. సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



దొడగట్టలోని ఓ ఇంటిలో సోదాలు చేస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణ సీఐ హరినాథ్, పలువురు ఎస్‌ఐలతో కలిసి శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లు, పాత కేసుల్లో ఉన్న వారి ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఎక్కడా అల్లర్లు, గొడవలకు పాల్పడరాదన్నారు. ఏ చిన్న గొడవ జరిగినా ఇరువైపులా అందరిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంబదూరు: డీఎస్పీ బి.శ్రీనివాసులు శనివారం మండలంలో పర్యటించారు. పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. మండలంలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేసి రౌడీ షీట్ తెరవాలని ఆదేశించారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, ఈ విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులు గమనించాలన్నారు. ఎస్‌ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం



ఆంజనేయ స్వామి పల్లకీని మోస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం/రాయదుర్గం టౌన్: హనుమజ్జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రసిద్ధి చెందిన పలు హనుమక్షేత్రాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బళ్లారి రోడ్డులో కొలువైన ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో మెట్టు గోవిందరెడ్డి పూజలు చేశారు. అనంతరం పల్లకీ ఉత్సవంలో పాల్గొని పల్లకీ మోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆంజనేయస్వామి దీవెనలతో ప్రజలంతా సుఖ, సంతోషాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మెట్టు మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్‌ను బట్టి వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించి మరోమారు అధికారం చేపట్టనుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు. దేవుడి ఆశీస్సులు, రాయదుర్గం ప్రజల దీవెనలతో తాను ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతోనే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన సముపార్జనకు కృషి చేశా



మాట్లాడుతున్న సీనియర్ లైబ్రేరియన్ అరుణజ్యోతి

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ లైబ్రేరియన్ అరుణజ్యోతి సేవలు అమోఘమని ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. అరుణజ్యోతి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం కళాశాలలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అరుణజ్యోతి లైబ్రేరియన్‌గా జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రంథాలయ అధికారిణిగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారని గుర్తు చేశారు. అరుణజ్యోతి మాట్లాడుతూ పుస్తక పఠనంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించి వారి విజ్ఞాన సముపార్జనకు శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు.

ఎంపీడీఓగా సాల్మన్ నియామకం



ఎంపీడీఓ సాల్మన్‌కు స్వాగతం పలుకుతున్న ఏఓ

కంబదూరు: నూతన ఎంపీడీఓగా సాల్మన్ నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న సుధాకర్ రాజు శుక్రవారం పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో కళ్యాణదుర్గం ఎంపీడీఓ సాల్మన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

శనేశ్వరస్వామికి పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగత్‌సింగ్ కాలనీలో వెలసిన శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అలంకరణ,అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

వజ్రకరూరు: గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరి సుఖ ప్రసవం పొందాలని వైద్యాధికారిణి తేజస్వి సూచించారు. కొనకొండ్ల గ్రామంలో శనివారం గర్భిణులకు ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పండంటి బిడ్డ కోసం గర్భిణులు పోషకాలు అధికంగా ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలని, తరచూ చెకప్ చేయించుకోవాలన్నారు. తొమ్మిదో నెలలో వారానికొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, శిశువు కదలిక తగ్గినట్లు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

వజ్రకరూరులో మోస్తరు వర్షం



జలమయమైన ఒక వీధి

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. అరగంటపాటు కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. కాగా ప్రస్తుతం కురిసిన వర్షం ఖరీఫ్‌లో వ్యవసాయ పనులకు ఎంతో అనుకూలంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

మేనేజర్ రాజేంద్రప్రసాద్ సేవలు ప్రశంసనీయం



పి.రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: వజ్రకరూరు ఏడీసీసీ బ్యాంకు మేనేజర్‌గా పి.రాజేంద్రప్రసాద్ రైతులకు, ఖాతాదారులకు అందించిన సేవలు ప్రశంసనీయమని వక్తలు అన్నారు. పుట్టపర్తికి బదిలీ అయిన నేపథ్యంలో శనివారం ఆయనకు బ్యాంకులో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి పూలమాలతో ఘనంగా సన్మానించారు. కళ్యాణదుర్గంలోని విధులు నిర్వహిస్తూ వజ్రకరూరుకు బదిలీపై వచ్చిన మేనేజర్ జి.హనుమంతరాయుడుకు స్వాగతం పలికి సన్మానించారు. వజ్రకరూరు పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, డైరెక్టర్ బలరాముడు, మాజీసర్పంచ్ వైద్యనాథరెడ్డి, సీఈఓ సురేష్, క్లర్క్ సతీష్ పాల్గొన్నారు.